
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సూర్యాపేట
5
మంగళవారం 19 మార్చి 2024



** రంజాన్ వేళలు | ఇఫ్తార్: 6.32 | సహర్ : 4.59 (బుధవారం)

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	: 18004251442
యాదాద్రి	: 1800 425 7106
సూర్యాపేట	: 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.126	183	208
సూర్యాపేట	రూ.120	180	210
నల్లగొండ	రూ.126	184	210

ఉష్ణోగ్రత గరిష్ఠం 38.0 । కనిష్ఠం 23.4



కల్యాణ తంతు నిర్వహిస్తున్న అర్చకులు

జగత్కల్యాణ కారకుడు, భక్తజనబాంధవుడు, ఆర్తత్రాణపరాయణుడు యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహుడిబ్రహ్మోత్సవ తిరుకల్యాణ పర్వాలు సోమవారం రాత్రి వైభవంగా కొనసాగాయి. యాదగిరికొండపై ఉత్తర తిరుమాఢ వీధిలోని తాత్కాలిక బ్రహ్మోత్సవ కల్యాణ వేదికపై అంగరంగ వైభవంగా కల్యాణ తంతును అర్చకులు, వేదపండితులు నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలు, అరటి, మామిడి తోరణాలు, రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించిన కల్యాణ వేదికపై అర్చక బృందం వేద మంత్రోచ్ఛారణ, ఆస్థాన విద్వాంసుల మంగళ వాయిద్యాల నడుమ లక్ష్మీనరసింహుల కల్యాణం కన్నుల పండువగా సాగింది.

- యాదగిరిగుట్ట

కళ్యాణ వైభోగమే

యాదగిరికొండపై వైభవంగా లక్ష్మీనారసింహుడి తిరుకల్యాణం

ముక్కోటి దేవతలు ఆహుతులుగా, చతుర్ముఖ బ్రహ్మాది దేవతల సమక్షంలో దేవదేవుడు నృసింహుడు లోక కల్యాణార్థం సముద్రుడి తనయ మహాలక్ష్మీ అమ్మవారి మెడలో వేద పండితులు నిర్ణయించిన సుముహూర్త ఘడియ తులా లగ్నంలో మాంగల్యధారణ చేశారు. ముందుగా పట్టు వస్త్రాలు, స్వర్ణ, వజ్రవైఢూర్య, ముత్యాల ఆభరణాలతో నవ వరుడిగా అలంకృతుడైన లోక కల్యాణకారకుడు మృగనరుడు నారసింహుడు గజవాహనం అధిరోహించగా, భక్తజనకోటికి సకల సంపదలను ప్రసాదించే మహాలక్ష్మీ అమ్మవారిని పుష్పాల పల్లకిలో మంగళవాయిద్యాలు.. మేళతాళాలు.. భక్త జనుల జయ జయ ధ్వానాలు, రుత్వికుల వేదపారాయణాలు.. ఆస్థాన విద్వాంసుల మంగళవాయిద్యాల నడుమ ఆలయ తిరువీధుల్లో ఊరేగింపు నిర్వహిస్తూ బ్రహ్మోత్సవ కల్యాణ వేదిక వద్దకు తీసుకువచ్చారు. స్వామివారి, అమ్మవారి ఉత్సవమూర్తులను బ్రహ్మోత్సవ కల్యాణమండపంపై ఎదురెదురుగా అధిష్ఠింపజేశారు. జగద్రక్షకుడు లక్ష్మీనృసింహుల కల్యాణ వేడుకలను శ్రీవైష్ణవ పాంచారాత్రగమ శాస్త్రరీతిలో దేవతల సైన్యాధ్యక్షుడు విశ్వక్సేనుడికి తొలి పూజలతో శ్రీకారం చుట్టారు. నూతన కల్యాణమూర్తులు స్వామి, అమ్మవార్లకు అర్చకులు రక్షాసూత్రధారణ చేసి వేద ప్రాశస్త్యమైన మంత్రోచ్చరణతో నృసింహుడికి యజ్ఞోపవీత్రధారణ తంతు నిర్వహించారు. దేవదేవుడు నృసింహుడికి లక్ష్మీ అమ్మవారి తండ్రి సముద్రుడు పాద ప్రక్షాళన చేసిన అనంతరం కన్యాదానం చేశారు. బ్రహ్మోత్సవ కల్యాణంలో వధూవరులు నరసింహుడు, మహాలక్ష్మీ అమ్మవార్ల శిరస్సులపై జీలకర్ర, బెల్లం అలంకరించే ఘట్టాలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. అనంతరం 'మాంగల్యం తంతు నానేనా, లోకరక్షణ హేతునా' అనే అర్చకుల వేద మంత్రోచ్చరణ, భక్తజనుల గోవింద నామస్మరణ నడుమ అమ్మవారి మెడలో మాంగల్యధారణ కొనసాగింది. నూతన కల్యాణమూర్తులు లక్ష్మీనృసింహులను ముత్యాల తలంబ్రాలతో ఆచార్యులు కొలిచారు. కల్యాణ వేడుకల అనంతరం నూతన కల్యాణమూర్తులు స్వామి, అమ్మవార్లను పక్కపక్కన కూర్చుండబెట్టిన అర్చకులు భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. లక్ష్మీనృసింహుల బ్రహ్మోత్సవ తిరుకల్యాణ పర్వాలను దేవస్థాన ప్రధానార్చకులు నల్లన్‌ధీఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు, కాందూరి వెంకటాచార్యుల ఆధ్వర్యంలో అర్చక బృందం నిర్వహించగా, ఆలయ అనువంశీక ధర్మకర్త భాస్కరాయణి నరసింహమూర్తి, కార్యనిర్వహణాధికారి భాస్కర్‌రావు, అధికారులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ఆంధ్రజ్యోతి దేవదేవుడి బ్రహ్మోత్సవం March 11-21 8వ రోజు





శ్రీరాముడి అలంకారంలో దర్శనమిచ్చిన నృసింహుడు

కల్యాణోత్సవంలో ప్రముఖులు

యాదగిరీశుడి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి నిర్వహించిన తిరుకల్యాణంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య దంపతులు పాల్గొన్నారు. వీరు స్వామివారి బ్రహ్మోత్సవ తిరుకల్యాణ టికెట్లు కొనుగోలు చేసి పాల్గొన్నారు. అయితే ఎన్నికల కోడ్ కారణంగా వీరికి దేవస్థాన అధికారులు, అర్చకుల నుంచి అధికారికంగా ఎలాంటి స్వాగతం లభించలేదు. వీరు సామాన్య భక్తుల మాదిరిగా కల్యాణ వేడుకల్లో పాల్గొన్నారు.

శ్రీరాముడిగా భక్తులకు దర్శనభాగ్యం

లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం శ్రీరాముడి అలంకారంలో నృసింహుడు భక్తులకు దర్శనమిచ్చి తరింపజేశాడు. ప్రధానాలయ అష్టభుజి ప్రాకార మండపంలో లక్ష్మీనృసింహుడిని శ్రీరాముడిగా దివ్యమనోహరంగా అలంకరించిన ఆచార్యులు హనుమంతుడి వాహనంపై అధిష్ఠింపజేశారు. మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ అలంకార సేవను ఆలయ తిరువీధుల్లో ఊరేగించారు. అనంతరం ప్రధానాలయ తూర్పు రాజగోపురం ఎదుట వేదికపై అలంకారసేవను అధిష్ఠింపజేసి, ప్రత్యేక పూజలు నిర్వహించిన పూజారులు రామావతారం గురించి వివరించారు.



శ్రీరాముడి అలంకారంలో ఊరేగుతున్న స్వామివారు



నృసింహుడి కల్యాణ వేదిక, బాణాసంచా వెలుగులు



స్వామివారి కల్యాణాన్ని తిలకిస్తున్న మంత్రులు కోమటిరెడ్డి, తుమ్మల, ఎమ్మెల్యే బీర్ల



పట్టువస్త్రాల సమర్పణ

పార్లమెంట్ ఎన్నికల కోడ్ కారణంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున స్వామి, అమ్మవార్లకు బ్రహ్మోత్సవ కల్యాణ పట్టువస్త్రాలను ఆలయ అనువంశిక ధర్మకర్త భాస్కరాయణి నరసింహమూర్తి, కార్యనిర్వహణాధికారి భాస్కర్‌రావు దంపతులు కల్యాణ వేదికపై అర్చకస్వాములకు అందజేశారు.

వంద రోజుల్లో వందల కోట్లతో అభివృద్ధి పనులు

- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



మంత్రి ఉత్తమ్‌ను సన్మానిస్తున్న మార్కెట్‌కమిటీ మాజీ చైర్మన్ నాగన్నగౌడ్

హుజూర్‌నగర్, మార్చి 18 : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే హుజూర్‌నగర్ నియోజకవర్గంలో వందల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. నియోజకవర్గంలోని రోడ్ల నిర్మాణానికి రూ.100 కోట్లు మంజూరు చేసినందుకు హైదరాబాద్‌లోని సచివాలయంలో ఉత్తమ్‌ను మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి యరగాని నాగన్నగౌడ్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రోడ్ల నిర్మాణానికి రూ.100 కోట్లతో పాటు మోడల్ కాలనీకి రూ.75 కోట్లు, ఎత్తిపోతల పథకాలకు రూ.100 కోట్లు, ఆసుపత్రి అభివృద్ధికి రూ.10 కోట్లు, ఐటీఐ కళాశాలకు రూ.35 కోట్లు విడుదల చేశామన్నారు. గతంలో ఎప్పుడూ ఎవరూ చేయని అభివృద్ధిని తాను చేస్తున్నానన్నారు. కాంగ్రెస్ పేదల సంక్షేమం కోసం పనిచేస్తుందన్నారు. గ్రామీణ రహదారులకు పెద్దమొత్తంలో నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రతీ ఎకరాకు నీరు అందించేందుకు ఎత్తిపోతల పథకాలు నిర్మిస్తున్నామన్నారు. నీరు లభ్యమైన చోట చెక్‌డ్యాంలు ఏర్పాటుచేస్తామన్నారు. వేసవిలో నీటిఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పులిచింతల బ్యాక్‌వాటర్‌ను సద్వినియోగం చేసుకుంటామన్నారు. నీటి వనరులను కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో మత్స్యకార్మిక సంఘం నాయకులు శీలం శ్రీను, చింతకాయల రాము, మల్లయ్య, వెంకన్న, శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

'పది' పరీక్షలు సజావుగా జరిగేలా చూడాలి



సూర్యాపేటలోని పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్

సూర్యాపేట అర్బన్, మార్చి 18 : పదో తరగతి పరీక్షలు జిల్లా సజావుగా జరిగేలా చూడాలని కలెక్టర్ ఎస్ వెంకటరావు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కాకతీయ, వివేకవాణి విద్యామందిర్ పాఠశాలల పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసి, మాట్లాడారు. పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు ప్రశాంత వాతావరణంతో పాటు అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. మొబైల్‌ఫోన్స్‌ను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిలేదని సూచించారు. ప్రతీ ఒక్కరిని క్షుణ్ణంగా తనిఖీ చేసి పరీక్షా కేంద్రంలోని అనుమతించాలని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంఈవో శైలజ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మొదటి రోజు 42 మంది గైర్హాజరు

జిల్లాలో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లాలో 67 కేంద్రాలను ఏర్పాటుచేయగా మొత్తం 11,946 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 11,904 మంది హాజరు కాగా 42 మంది గైర్హాజరయ్యారు. అదేవిధంగా మొదటిసారి ఫెయిల్ అయిన 18మంది విద్యార్థులు పరీక్ష రాయల్సి ఉండగా వారిలో 17 మంది పరీక్ష రాయగా ఒక్కరు గైర్హాజరయ్యారని డీఈవో అశోక్ తెలిపారు.

ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూం ఏర్పాటు

సూర్యాపేట(కలెక్టరేట్), మార్చి 18 : జిల్లాలో లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూం ఏర్పాటుచేసినట్లు కలెక్టర్ వెంకటరావు తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో ఎలక్షన్ ఇంటిగ్రేటెడ్ కంట్రోల్‌రూంను అదనపు కలెక్టర్ బీఎస్ లతతో కలసి ప్రారంభించి, మాట్లాడారు. సీవిజిల్, 1950కాల్‌సెంటర్, సువిధ పర్మిషన్స్ ఎన్‌జీఆర్‌పీఎస్ పోర్టల్ అదేవిధంగా పీడబ్ల్యూడీ సాక్షమ్ యాప్‌లు అందుబాటులో ఉంటాయన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలకు ఎదురయ్యే ఇబ్బందులను సత్వరమే పరిష్కరించే దిశగా యాప్‌లను అందుబాటులో ఉంచామన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో అప్పారావు, ఏవో సుదర్శన్‌రెడ్డి, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు శ్రీనివాసరాజు, ఈడీఎం గఫార్ సిబ్బంది పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోళ్లు ఎన్నడో?

గత ప్రభుత్వం వానాకాలం, యాసంగిలో సగం మంది రైతులు ధాన్యం విక్రయించాక ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఈలోగా రైతులు వ్యాపారులు, దళారులకు ధాన్యం విక్రయించారు. మద్దతు ధర లభించక, తరుగు పేరుతో కోత, బస్తాల్లో నింపకున్నా బస్తాల పేరుతో కోత, వెంటనే డబ్బులు ఇవ్వక పోయినా 2శాతం కమీషన్, గుమస్తా మామూలు, వేబ్రిడ్జి చార్జీ, తూకం వేయకపోయినా హమాలి అంటూ రకరకాల కోతలతో రైతులు నష్టపోయారు. ప్రస్తుత సీజన్‌లో ఉమ్మడి జిల్లాలో వరి కోతలు ప్రారంభమయ్యాయి. ఈ నెల చివరి వారంలో వరి కోతలు ఊపందుకుంటాయి. అయినా ప్రభుత్వం నేటికీ ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోలేదు.

- మోత్కూరు

ప్రారంభమైన వరి కోతలు ▸ బోనస్ ప్రకటన కోసం రైతుల ఎదురు చూపు

ఏటా యాసంగిలో మార్చి నెలలో వరి కోతలు ప్రారంభమవుతాయి. ఇది తెలిసినా ప్రభుత్వాలు ఏప్రిల్ రెండో వారం, లేదా మూడో వారంలో ధాన్యంకొనుగోలు కేంద్రాలు నెమ్మదిగా ప్రారంభించడం రివాజుగా మారింది. మార్చిలో వరి కోసిన రైతులు 20, 30 రోజులు ధాన్యాన్ని నిల్వచేయలేక వెంటనే వ్యాపారులకు విక్రయించి నష్టపోతున్నారు. వెంటనే ధాన్యం విక్రయించకుంటే అకాల వర్షాలు కురిస్తే తడిచే ప్రమాదం ఉంది. ఈ భయంతో రైతులు నూర్చిడి చేసిన ధాన్యాన్ని వెనువెంటనే వ్యాపారులకు విక్రయిస్తున్నారు. కాగా, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం గత ప్రభుత్వాల ఒరవడినే కొనసాగిస్తుందా లేక సకాలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తుందా అని రైతులు చర్చించుకుంటున్నారు. ప్రభుత్వం స్పందించి మార్చి చివరివారం లోనైనా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.

గతంలో 858 ధాన్యం కొనుగోలు కేంద్రాలు

గతంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో 858 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. నల్లగొండలో 278, సూర్యాపేటలో 278, యాదాద్రిభువనగిరి జిల్లాలో 302 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇప్పుడు ఎన్ని కేంద్రాలు ఏర్పాటు చేస్తారన్నది ఇంకా నిర్ణయించలేదని అధికారులు చెబుతున్నారు. యాసంగిలో ఉమ్మడి జిల్లాలో 9,37,684 ఎకరాల్లో వరి సాగైంది. యాదాద్రి జిల్లాలో 3,11,421 ఎకరాలు, సూర్యాపేట జిల్లాలో 2,06,263 ఎకరాలు, నల్లగొండ జిల్లాలో 4,20,000 ఎకరాల్లో వరి సాగైంది. వర్షాభావ పరిస్థితులతో గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది వరి సాగు తగ్గింది. దీంతో ధాన్యం దిగుబడి తగ్గనుండటంతో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల సంఖ్య కూడా తగ్గే అవకాశం ఉంది.

బోనస్ ఇచ్చేనా?

ప్రభుత్వ మద్దతు ధర ఏ-గ్రేడ్ ధాన్యానికి క్వింటాకు రూ.2,203, సాధారణ రకానికి రూ.2183గా ఉంది. ఇది మద్దతు ధర మాత్రమేగానీ గిట్టుబాటు ధరకాదు. రైతు పంటకు గిట్టుబాటు కల్పించడం కోసం గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామని హామీ ఇవ్వడంతోపాటు మేనిఫెస్టోలో పెట్టింది. దీంతో ఈ యాసంగి సీజన్ నుంచి ప్రభుత్వం బోనస్ చెల్లిస్తుందా లేదా అని రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. బోనస్ విషయమై ప్రభుత్వం ఏమైనా ఆలోచన చేస్తోందా అని రైతులు అధికారులను ఆరా తీస్తున్నారు.

బోనస్ ఇస్తే ఎకరాకు రూ.14వేల వరకు ఆదాయం

రైతుకు ఎకరాకు 30 నుంచి 40 బస్తాల (21 నుంచి 28 క్వింటాళ్లు) ధాన్యం దిగుబడి వస్తుంది. ప్రభుత్వం క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తే ఒక్కో రైతుకు ఎకరాకు రూ.10,500 నుంచి రూ.14,000 వరకు అదనంగా ఆదాయం వస్తుంది. దీంతో ఈ యాసంగి సీజన్ నుంచే ధాన్యానికి బోనస్ ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

కొనుగోలు కేంద్రాలు వెంటనే ఏర్పాటు చేయాలి



గత ప్రభుత్వం ఏటా ఆలస్యంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంతో సగం మంది రైతులు వ్యాపారులు, దళారులకు ధాన్యం విక్రయించి ఆర్థికంగా నష్టపోయేవారు. ఈ ప్రభుత్వమైనా మార్చి చివరి వారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, కొనుగోళ్లు ప్రారంభించాలి. రైతుల ఆకాంక్ష, ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు ఈ యాసంగి నుంచే క్వింటాకు రూ.500 బోనస్ చెల్లించాలి.

- యానాల దామోదర్‌రెడ్డి, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి

ప్రజలను మోసం చేస్తే చర్యలు తప్పవు



ఏఆర్ఎస్ఐ కుటుంబానికి ఆర్థికసహాయం అందజేస్తున్న ఎస్పీ రాహుల్‌హెగ్డే

సూర్యాపేటక్రైం, మార్చి 18: ప్రజలను మోసం చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్పీ రాహుల్ హెగ్డే అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన గ్రీవెన్స్‌డేలో ఆయన మాట్లాడారు. ప్రజల అర్జీలపై సంబంధిత అధికారులు వేగంగా పరిష్కరించాలన్నారు. ఉద్యోగాలు, పథకాలు, బహుమతులు అంటూ అమాయకపు ప్రజలను ఆర్థికంగా మోసం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఉద్యోగాలు, బహుమతుల పేరుతో ఇతరులను నమ్మి నగదును ఇవ్వొద్దన్నారు. ఈ సందర్భంగా తొమ్మిది అర్జీలు వచ్చాయన్నారు. అనంతరం ఇటీవల మృతి చెందిన జిల్లా ఆర్మ్‌డ్ విభాగం ఏఆర్ ఎస్ఐ వెంకటయ్య కుటుంబానికి పోలీస్ చేయూత పథకం కింద మంజూరైన రూ.2 లక్షల చెక్కును అందజేశారు. అనంతరం జిల్లా పోలీస్ కార్యాలయంలోని ప్రజావాణి హాల్‌లో బ్యాంక్‌ఆఫ్‌బరోడా ఆధ్వర్యంలో అందజేసిన వాటర్ కూలర్‌ను ప్రారంభించి, మాట్లాడారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ నాగేశ్వరరావు, ఏఆర్‌అదనపు ఎస్పీ జనార్ధన్‌రెడ్డి, ఆర్ఐలు నారాయణరాజు, నర్సింహా, పోలీస్ సంఘం అధ్యక్షుడు రాంచందర్‌గౌడ్, కృష్ణ, బ్యాంక్ ఉద్యోగులు పాల్గొన్నారు.


ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలి

చివ్వెంల, మార్చి 18: జిల్లాలో ఎన్నికలు సజావుగా జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని ట్రైనీ ఐపీఎస్ రాజేష్‌మీనా అన్నారు. సోమవారం మండల కేంద్రంతో పాటు బండమీదిచందుపట్ల గ్రామాల్లో సీఐఎస్ఎఫ్ సిబ్బంది, పోలీస్ సిబ్బందితో కలిసి కవాతు నిర్వహించి, మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి పటిష్ఠ బందోబస్తుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో సీఐ వై.సురేందర్‌రెడ్డి, ఎస్.వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.



బండమీదిచందుపట్లలో కవాతు నిర్వహిస్తున్న సీఐఎస్ఎఫ్ సిబ్బంది, పోలీసులు

హరిహరులకు విశేష పూజలు


ప్రధానాలయ ముఖమండపంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న నేషనల్ డిఫెన్స్ కాలేజీ బృందం

యాదగిరిగుట్ట, మార్చి 18: యాదగిరీశుడి సన్నిధిలో సోమవారం హరిహరులకు విశేష పూజలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. స్వయంభూ పాంచనారసింహుడికి శ్రీవైష్ణవ పాంచరాత్రాగమ శాస్త్రరీతిలో, కొండపైన అనుబంధ శివాలయంలో కొలువుదీరిన రామలింగేశ్వరుడికి శైవాగమ పద్ధతిలో నిత్యవిధి కైంకర్యాలను నిర్వహించారు. ప్రధానాలయంలోని స్వయంభువులను సుప్రభాతంతో మేల్కొలిపిన ఆచార్యులు నిత్యవిధి కైంకర్యాలు నిర్వహించారు. కొండపైన అనుబంధ ఆలయమైన శివాలయంలో పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరుడిని, మహామండపంలోని స్ఫటిక మూర్తులను అర్చకులు వేద మంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల నడుమ పంచామృతాలతో అభిషేకించారు. శివపార్వతుల సహస్రనామ పఠనాలతో బిల్వపత్రార్చనలు చేశారు. సాయంత్రం వేళ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్ల అలంకార వెండి జోడు సేవలు, శివాలయంలో శివపార్వతుల ఉత్సవమూర్తులను దివ్యమనోహరంగా అలంకరించి, తిరువీధుల్లో సేవోత్సవం నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.29,54,302 ఆదాయం సమకూరినట్టు దేవస్థాన అధికారులు తెలిపారు.

స్వామి సేవలో నేషనల్ డిఫెన్స్ కాలేజీ బృందం

యాదగిరీశుడిని న్యూఢిల్లీ నేషనల్ డిఫెన్స్ కాలేజీ బృందం దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొనగా, అర్చకులు ప్రత్యేక దర్శన సౌకర్యం కల్పించారు. వీరు గర్భాలయంలోని స్వయంభువులను దర్శించుకుని ముఖమండపంలో ఉత్సవమూర్తుల చెంత సువర్ణ పుష్పార్చన పూజల్లో పాల్గొన్నారు. అనంతరం స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీరామవతార అలంకార సేవలో పాల్గొనగా అర్చకులు వీరికి స్వామివారి ఆశీస్సులను అందజేశారు. ముందుగా క్షేత్ర సందర్శనకు విచ్చేసిన వీరికి జిల్లా కలెక్టర్ హనుమంత్ కే.జెండగే, డీసీపీ రాజేశ్‌చంద్ర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్టడీ టూర్ ఎకనామిక్ సెక్యూరిటీ కార్యక్రమంలో భాగంగా మేజర్ జనరల్ ఏకే.సింగ్ ఆధ్వర్యంలో 16మంది బృందం తెలంగాణ రాష్ట్ర పర్యటనలో భాగంగా యాదగిరిక్షేత్రాన్ని సందర్శించినట్టు తెలిపారు. కార్యక్రమంలో వారి వెంట దేవస్థాన ఈవో ఎ భాస్కర్‌రావు, అదనపు కలెక్టర్ గంగాధర్, ఆర్డీవో అమరేందర్ ఉన్నారు.

బ్లాస్టింగ్‌కు యత్నించిన ఇద్దరి రిమాండ్

వలిగొండ, మార్చి 18: నిబంధనలకు విరుద్ధంగా వ్యవసాయ భూమిలో అక్రమ బ్లాస్టింగ్‌కు యత్నించిన ఇద్దరిని పోలీసులు సోమవారం రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ మహేందర్‌లాల్ తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రిభువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలంలోని లింగరాజుపల్లికి చెందిన నందినూరు రమేష్‌కు వలిగొండ మండల పరిధి అర్రూరులో వ్యవసాయ భూమి ఉంది. ఆ భూమిలో బండలను తొలగించడానికి ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఆత్మకూరు(ఎం)కు చెందిన కొమ్మగాని శ్రీధర్‌తో బ్లాస్టింగ్ చేయించి బండలను తొలగించడానికి ఒప్పందం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లారు. అక్కడ 53జెలిటిన్ స్టిక్స్, ఒక కట్ట కనెక్టింగ్ వైర్, ఒక మెఘర్ బాక్స్ మరో కనెక్ట్ వైర్(తెలుపు) గుర్తించి సీజ్ చేశారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి న్యాయస్థానంలో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.

మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి

నల్లగొండ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న శానంపూడి సైదిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు వర్షిత్‌రెడ్డి

నల్లగొండ, మార్చి 18: దేశంలో బీజేపీ హవా నడుస్తోందని, యావత్ దేశం మొత్తం మోదీ మూడోసారి ప్రధాని కావాలని కోరుతోందని నల్లగొండ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లాకేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశరక్షణకు మోదీ చిరునామా అని, అయోధ్య రామాలయం ప్రజల మధ్య ఐక్యతను చాటుతుందన్నారు. రామాలయ నిర్మాణం ఒక్క మోదీ వల్లే సాధ్యమైందన్నారు. ఆరు గ్యారెంటీల స్కీం అబద్ధాల స్కీం అన్నారు. రాష్ట్రంలో కరువు తాండవిస్తుందని ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష లేదన్నారు. నల్లగొండ పార్లమెంట్‌లో త్వరలో మంచి మేనిఫెస్టోతో ప్రజల్లోకి వెళ్తానన్నారు. నల్లగొండలో కాషాయ జెండా ఎగరడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో బీజేపీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, సాగర్ నియోజకవర్గ నాయకురాలు కంకణాల నివేదితారెడ్డి, జిల్లా ప్రధానకార్యదర్శి పోతేపాక లింగ స్వామి, ఉపాధ్యక్షుడు మిరియాల వెంకటేశం, మండల వెంకన్న, శిరీష, భూపాల్‌రెడ్డి, రాజీ, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దాడి కేసులో వ్యక్తికి తొమ్మిది నెలల జైలుశిక్ష

గుర్రంపోడు, మార్చి 18: ఇద్దరి వ్యక్తులపై కర్రలతో దాడి చేసి కొట్టి గాయపర్చిన వ్యక్తికి తొమ్మిది నెలలు జైలుశిక్షతో పాటు రూ.5వేల జరిమానా విధిస్తూ దేవరకొండ మున్సిఫ్ కోర్టు తీర్పు ఇచ్చింది. ఎస్ఐ శివప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. గుర్రంపోడు గ్రామానికి చెందిన మర్రి సరిత ఆమె తండ్రి జాల శ్రీనులను అదే గ్రామానికి చెందిన జాల కామయ్య గత సంవత్సరం దాడి చేసి గాయపర్చాడు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ శివప్రసాద్ కేసు నమోదు చేసుకుని అభియోగ పత్రం దాఖలు చేశారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ సంతోష్‌కుమార్ వాదనలు వినిపించారు. సాక్ష్యాధారాలతో సహా నేరం రుజువు కావడంతో నిందితుడికి తొమ్మిది నెలల జైలుశిక్షతో పాటు రూ.5వేలు జరిమానా విధిస్తూ జడ్జి సోమవారం తీర్పు వెల్లడించారు.

విద్యుదాఘాతంతో మహిళ..

పాలకవీడు, మార్చి18: విద్యుదాఘాతంతో మహిళ మృతిచెందింది. ఈ ఘటన సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలం కల్మెట్‌తండాలో జరిగింది. ఎస్ఐ లక్ష్మీనర్సయ్య తెలిపిన వివరాల ప్రకారం.. కల్మెట్‌తండాకు చెందిన రూపావత్ లలిత(32) తెగి ఉన్న విద్యుత్ వైర్‌ను గమనించక ఇంట్లో బండలు, గోడలు కడుగుతుండగా విద్యుదాఘాతానికి గురై మృతిచెందింది. లలితకు భర్త, కుమార్తె ఉన్నారు. భర్త రూపావత్ రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి


కోటయ్య మృతదేహంతో ఆందోళన చేస్తున్న కుటుంబసభ్యులు

పెన్‌పహాడ్, మార్చి 18: అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలంలోని నాగులపాటి అన్నారం బ్రిడ్జి గ్రామంలో సోమవారం జరిగింది. పోలీసులు, మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా మిర్యాలగూడెం మండలం బోర్రాయిపాలెం అన్నారం గ్రామానికి చెందిన ఆవుల కోటయ్య(58) సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం అన్నారం బ్రిడ్జి గ్రామానికి చెందిన పర్వతం చంద్రయ్య వద్ద కుటుంబ అవసరాల నిమిత్తం రూ.లక్ష అప్పుగా తీసుకున్నాడు. కొన్నికారణాలతో అప్పు తీర్చలేకపోయాడు. తన అప్పు తీర్చాలని బోర్రాయిపాలెం అన్నారం గ్రామానికి వెళ్లి నెల రోజుల క్రితం చంద్రయ్య ఆవుల కోటయ్యను నిలదీశాడు. తర్వాత ఇస్తామని చెప్పినా వినకుండా కోటయ్యను అన్నారం బ్రిడ్జి గ్రామానికి చంద్రయ్య తీసుకొచ్చి అప్పు కింద(జీతం) పని చేయించుకుంటున్నాడు. సోమవారం ఉదయం ఆరు గంటలకు పర్వతం చంద్రయ్య కోటయ్య పెద్ద కుమారుడు ఆవుల శేఖర్‌కు ఫోన్ చేసి నీ తండ్రి కోటయ్య ఉరి పెట్టుకొని ఆత్మహత్య చేసుకున్నాడని చెప్పాడు. వెంటనే కోటయ్య కుటుంబ సభ్యులు, బంధువులు అన్నారం బ్రిడ్జి గ్రామంలోని సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఉరి వేసుకున్న తీరును గమనించి అనుమానం వ్యక్తం చేశారు. చంద్రయ్య, అతని కుటుంబ సభ్యులే హత్య చేసి, ఉరి పెట్టుకున్నాడని చిత్రీకరిస్తున్నారని ఆరోపిస్తూ మృతదేహాన్ని చంద్రయ్య ఇంట్లో వద్ద ఉంచి ఆందోళనకు దిగారు. పెన్‌పహాడ్ ఎస్ఐ రవీందర్, డ్వాగ్ స్క్వాడ్ తీసుకువచ్చి విచారణ జరిపించారు. దీంతో సంతృప్తి చెందని మృతుడి బంధువులు ఆందోళన ఉధృతం చేశారు. దీంతో సూర్యాపేట రూరల్ సీఐ సురేందర్‌రెడ్డి, సూర్యాపేట రూరల్ ఎస్ఐ బాలు, ఆత్మకూర్(ఎస్) ఎస్ఐ సైదులు, పెన్‌పహాడ్ ఎస్ఐ రవీందర్‌ల ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. దీంతో మృతుడి కుటుంబసభ్యులకు రూ.3.70లక్షలు నష్టపరిహారం చెల్లిస్తామని పర్వతం చంద్రయ్య వారి కుటుంబ సభ్యులు, కోటయ్య కుటుంబ సభ్యులకు హామీ పత్రం రాసి ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కోటయ్య కుమారుడు శేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట జనరల్ ఆసుపత్రికి తరలించారు. కోటయ్యకు భార్య వెంకటమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు.


కోటయ్య(ఫైల్)

అనిశెట్టిదుప్పలపల్లిలో గుర్తుతెలియని వ్యక్తి హత్య



తిప్పర్తి, మార్చి 18: గుర్తుతెలియని వ్యక్తి హత్యకు గురయ్యాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలంలోని అనిశెట్టి దుప్పలపల్లి గ్రామం శివారులో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అనిశెట్టిదుప్పలపల్లి గ్రామానికి చెందిన సక్కుబాయి అనే మహిళకు చెందిన వ్యవసాయ బావిలో గుర్తుతెలియని 35 నుంచి 40 సంవత్సరాల వయసు కలిగిన గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని తాళ్లతో కట్టి నీటి బావిలో పడేశారు. అదే వ్యవసాయ బావి వద్ద కౌలు రైతు పవన్ సోమవారం మధ్యాహ్నం పొలం వద్దకు వెళ్తుండగా బావిలో తేలియాడుతున్న మృతదేహాన్ని గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని బావిలో ఉన్న వ్యక్తి మృతదేహాన్ని బయటికి తీసి పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వివరాలు తెలిసిన వారు తిప్పర్తి పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ తెలిపారు.

ఇద్దరిని బలిగొన్న రోడ్డు ప్రమాదాలు


కోటేశ్వర్(ఫైల్)

నల్లగొండ టౌన్, చిట్యాల రూరల్, మార్చి 18: నల్లగొండ జిల్లాలో సోమవారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతిచెందారు. నల్లగొండ జిల్లాకేంద్రంలో బైక్ అదుపు తప్పడంతో కింద పడి యువకుడు, చిట్యాల మండలంలో కారు ఢీకొని మరో వ్యక్తి మృతిచెందాడు. అనుమల మండలం చల్మారెడ్డిగూడెం గ్రామానికి చెందిన నాగార్జున వేణు, వంగూరి కోటేశ్వర్(25) స్నేహితులు. వృతి రీత్యా ఇద్దరూ పెయింటర్లు. వేణు నల్లగొండలో అద్దెకు ఉంటుండగా, కోటేశ్వర్ మాత్రం గ్రామంలో ఇంటి వద్ద ఉంటూ నల్లగొండలో పెయింటింగ్ పనులకు వచ్చేవాడు. ఈ క్రమంలో ఆదివారం నల్లగొండకు వచ్చిన కోటేశ్వర్ స్నేహితుడు నాగార్జున వేణు గదికి వెళ్లాడు. అటు నుంచి స్నేహితులిద్దరూ రాత్రి వేణు బైక్‌పై తమ స్వగ్రామానికి బయలుదేరారు. జిల్లాకేంద్రంలోని బీటీఎస్ ప్రాంతంలో రోడ్డు పనులు జరుగుతుండటంతో అది గమనించకుండా అజాగ్రత్తగా బైక్ నడపడంతో బైక్ వెనుక ఉన్న కోటేశ్వర్ అదుపుతప్పి కింద పడిపోయాడు. తలకు తీవ్రంగా గాయం కావడంతో వెంటనే అస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. కోటేశ్వర్ తల్లి జయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ ఎస్ఐ నాగరాజు తెలిపారు.

రోడ్డు దాటుతుండగా కారు ఢీకొని..


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

చిట్యాల మండలం పెద్దకాపర్తి శివారులో సోమవారం రాత్రి కారు ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. వాహనదారులు తెలిపిన వివరాల ప్రకారం... పెద్దకాపర్తి శివారులో రహదారి పక్కన గల గాంధీ గుడికి ఎదురుగా ఉన్న గుట్ట ప్రాంతంలో జరుగుతున్న కట్టడాల వద్ద కూలీ పనిచేసే వ్యక్తి రాత్రి సమయంలో రోడ్డు దాటి గాంధీగుడి సమీపంలో గల హోటల్ వద్దకు వెళ్లి తిరిగి తాను ఉండే ప్రాంతానికి నిద్రించేందుకు రోడ్డు దాటి వెళుతున్నాడు. ఈ క్రమంలో రహదారిపై వాహనాలు వస్తుండడంతో రోడ్డు దాటుతున్న అతను ఆందోళనలో రోడ్డును దాటూతూ అటూ ఇటూ తచ్చాడే సమయంలో హైదరాబాద్ వైపునకు వెళుతున్న టీఎస్08 జీఎస్4696 నంబరు గల కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో అతడికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతునికి సంబంధించిన వివరాలు తెలియరాలేదు. రోడ్డు ప్రమాద విషయమై చిట్యాల ఎస్ఐ సైదాబాబును సంప్రదించగా మృతుడి వివరాలు తెలియరాలేదని, ఫిర్యాదు కూడా అందలేదని ఆయన తెలిపారు.

అదుపు తప్పి ఆలయంలోకి దూసుకెళ్లిన కారు


ఆలయంలోకి దూసుకెళ్లిన కారు

భూదాన్‌పోచంపల్లి, మార్చి 18: మద్యం మత్తులో యువకుడు కారు నడపడంతో అదుపు తప్పి ఆలయంలోకి దూసుకెళ్లింది. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లిలో ఆదివారం రాత్రి జరిగింది. నల్ల పోచమ్మ దేవాలయంలోని నాభిశిలతోపాటు ఆలయ మండపం, స్తంభం ధ్వంసమైంది. ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. భూదాన్‌పోచంపల్లి పట్టణానికి చెందిన సీత సంజయ్ అనే యువకుడు కారులో ఫంక్షన్‌కు వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో మద్యం మత్తులో అతివేగంగా కారు నడిపాడు. అయితే పట్టణంలోని ఎస్‌డబ్ల్యూ బాలికల వసతి గృహం వద్ద రోడ్డుపై మూలమలుపు వద్ద అతివేగంగా వెళ్తూ తప్పించబోయే క్రమంలో పక్కనే ఉన్న నల్ల పోచమ్మ దేవాలయంలోకి కారు దూసుకెళ్లింది. ఆలయం ముందున్న నాభిశిల(బొడ్రాయి)తోపాటు ఆలయం మండలం పిల్లర్‌ను కారు బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న బెలూన్‌లు విప్పుకోవడంతో డ్రైవర్ సీటులో ఉన్న సీత సంజయ్‌కు ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఆలయం పూర్తిగా ధ్వంసమైంది. ఎస్ఐ భాస్కర్‌రెడ్డి సంఘటనా స్థలాన్ని చేరుకున్నారు. కారును పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పార్టీ విధేయతకు దక్కిన ఫలితం

పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా పటేల్



సూర్యాపేటటౌన్, మార్చి 18: కాంగ్రెస్ పార్టీకి విధేయుడిగా ఉన్న టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్‌రెడ్డికి రాష్ట్ర స్థాయిలో కీలక పదవి దక్కింది. ఆయనను తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా ప్రభుత్వం నియమించింది. పటేల్ రమేష్‌రెడ్డి సూర్యాపేట జిల్లా బాలెంల గ్రామంలో 1970లో జన్మించారు. 1995లో బాలెంల సర్పంచ్‌గా తన రాజకీయ ప్రస్థానం మొదలు పెట్టారు. 2001లో ఎంపీటీసీగా గెలుపొందారు. 2006వసంవత్సరంలో తన భార్య పటేల్ లావణ్యను జడ్పీటీసీగా గెలిపించుకున్నారు. 2014లో అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ నుంచి పోటీ చేసిన ఓటమి చెందారు. సీఎం రేవంత్‌రెడ్డికి చిన్ననాటి స్నేహితుడైన పటేల్ 2019లో సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. అదే సందర్భంలో 2019 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి సూర్యాపేట అభ్యర్థిగా టికెట్ ఆశించినా దక్కలేదు. మాజీమంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డికి కేటాయించారు. అదేవిధంగా 2023 సంవత్సర అసెంబ్లీ ఎన్నికల్లో తిరిగి సూర్యాపేట అసెంబ్లీ నియోజకర్గం నుంచి కాంగ్రెస్ తరుపున మళ్లీ టికెట్ ఆశించగా రెండో సారికూడా భంగపాటు తప్పలేదు. అయితే 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపొంది అధికారంలోకి రాగా 2024 మార్చిలో పటేల్ రమేష్‌రెడ్డి రాష్ట్ర పర్యటక అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా నియమితులయ్యారు.

ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా ప్రీతం



మోత్కూరు, మార్చి 18: యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు పట్టణానికి చెందిన నాగరిగారి ప్రీతం ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులయ్యారు. ఆయన రెండు దశాబ్దాలకు పైగా కాంగ్రెస్ పార్టీకి విధే యుడిగా ఉన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ఎస్సీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. ప్రీతం 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తుం గతుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ టికెట్ కోసం పోటీ పడినా టికెట్ దక్కలేదు. అసెంబ్లీ ఎన్నికల అనంతరం ఆయనకు ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పదవి వరించింది. 2002లో ఎన్ఎస్ యూఐలో చేరిన ఆయన అంచెలంచెలుగా ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్, కాంగ్రెస్‌లో పలు పదవులు నిర్వహిం చారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేశారు. కొవిడ్ కాలంలో ఆయన ప్రజలకు పలు రకాల సేవలు అందించారు. 2021 జూన్‌లో అడ్డగూడూ రులో జరిగిన మరియమ్మ లాకప్‌డెత్ సంఘటనపై పోరాడారు. అప్పటి అసెంబ్లీలో కాంగ్రెస్ పక్షనేత భట్టి విక్రమార్కతో కలిసి బాధిత కుటుం బానికి కేసీఆర్ ప్రభుత్వంతో తగిన ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇప్పించి న్యాయం చేకూర్చడంతో పాటు ఆ సంఘటనకు కారుకులైన ఎస్ఐని, ఇద్దరు కానిస్టేబుళ్లను ఉద్యోగాల నుంచి తొలగించే వరకు పోరాడారు. తనకు ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇచ్చినందుకు ఆయన సీఎం రేవంత్‌రెడ్డిని ఆదివారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

ఉమెన్స్ కోఆపరేటివ్ సంస్థ చైర్మన్‌గా శోభారాణి



ఆలేరు రూరల్, మార్చి 18: రాష్ట్ర మహిళా సహకార అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా బండ్రు శోభారాణి నియమితులయ్యారు. రైతుల హక్కుల పరిరక్షణ, బీడీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం, పర్యావరణ పరిరక్షణ కోసం 1989లో నక్సలైట్‌గా అడవి బాట పట్టారు. అనంతరం చోటు చేసుకున్న పరిస్థితులు రాజకీయాల్లోకి రావడంతో బీఆర్ఎస్ రాష్ట మహిళా అధ్యక్షురాలిగా, టీడీపీ, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల్లో పలు కీలక పదవుల్లో పనిచేశారు. మెదక్ జిల్లా రామాయణపేటలో 20 జూలై 1972లో ఆమె జన్మించారు. 1987లో దొంగలధర్మారం జడ్పీహెచ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి, 1989లో రామాయణపేటలో ఇంటర్, 1997లో ఆలేరు కేంద్రంగా నడుస్తున్న బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ పట్టా సాధించారు. ఆలేరుకు చెందిన ప్రముఖ కమ్యూనిస్టు నేత బండ్రు నర్సింహులు కుమారుడు బండ్రు భాస్కర్‌తో నక్సలైట్ పార్టీ పెద్దల సమక్షంలో వివాహం చేసుకున్నారు. 2001లో ఉద్యమాలకు స్వస్తి చెప్పి నారాయణపేట జడ్పీటీసీగా స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీ చేసి రాజకీయ ఆరంగేట్రం చేశారు. 2022లో కాంగ్రెస్‌లో చేరారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో ఆమెకు కార్పొరేషన్ పదవి వరించింది. పదవి ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర ప్రజలకు ఆమె ధన్యవాదాలు తెలిపారు.

దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్‌గా వీరయ్య



గరిడేపల్లి, మార్చి 18: సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం కట్టవారిగూడెంలో రైతు కుటుంబంలో జన్మించిన ముత్తినేని వీరయ్య సామాన్య కాంగ్రెస్ కార్యకర్తగా ప్రస్థానం ప్రారంభించారు. అప్పటి నుంచి ఆయన పార్టీ నియమావళికి కట్టుబడి పనిచేస్తున్నారు. ఆయన నిబద్ధతను గుర్తించిన పార్టీ రాష్ట్ర వికలాంగుల ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించింది. ఉస్మానియా యూనివర్శిటీలో ఎమ్మెస్సీ మేథమెటిక్స్, ఎంఫిల్ మేథమెటిక్స్, బీఎడ్ చేశారు. వితంతువులు, వృద్ధులు, దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి పలు ఉద్యమాలు నిర్వహించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వికలాంగులు, వృద్ధులు, వితంతువులకు అన్యాయం జరుగుతుందని 2012లో ఇందిరా పార్కు వద్ద అర గుండుతో నిరసన తెలిపారు. మునగాల ప్రాంతాన్ని భద్రాచలంలో కలిపి ఆంధ్రాలో కలపాలని ప్రతిపాదనలు వచ్చిన సమయంలో వికలాంగుల ఆధ్వర్యంలో ఎన్‌హెచ్-9పై ఎనిమిది గంటల పాటు ఆందోళన చేశారు. 2017లో నాటి టీఆర్ఎస్ ప్రభుత్వం వికలాంగులు, వయో వృద్ధుల సంక్షేమ శాఖను స్త్రీ శిశు సంక్షేమ శాఖలో విలీనం చేసినప్పుడు దానిని రద్దు చేయాలని గాంధీభవన్‌లో ఆమరణ నిరాహార దీక్ష చేశారు. పార్టీకి అనేక విధాలుగా తన వంతు సేవలు అందించడంతో రాష్ట్ర ప్రభుత్వంలో వికలాంగుల ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియ పదవి వరించిందని ఆయన తెలిపారు.

తుంగతుర్తిలో హిజ్రాల వీరంగం

- పరస్పర దాడులకు పాల్పడ్డ రెండు వర్గాలు
- సుమోటోగా కేసు నమోదు చేసిన పోలీసులు


తుంగతుర్తి మండలకేంద్రంలో ఘర్షణ పడుతున్న హిజ్రాలు

తుంగతుర్తి, మార్చి 18: సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండల కేంద్రంలో సోమవారం హిజ్రాలు వీరంగం సృష్టించారు. రెండు వర్గాలుగా విడిపోయి పరస్పర దాడులకు పాల్పడ్డారు. ఈ గొడవ సినిమా ఫైట్‌ను తలపించే విధంగా ఉండడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. స్థానిక పోలీసులు తెలిపిన వివవరాల ప్రకారం... తుంగతుర్తి మండల కేంద్రంలో ప్రతి సోమవారం సంత జరుగుతుంది. అందులో భాగంగా భిక్షాటన చేయడానికి తిరుమలగిరి, సూర్యాపేటకు చెదిన ఇరు వర్గాల హిజ్రాలు సోమవారం తుంగతుర్తికి చేరుకున్నారు. తుంగతుర్తి ప్రాంతం సూర్యాపేట హిజ్రాలకు చెందిందని.. మీరు ఇక్కడికి ఎందుకు వస్తారని తిరుమలగిరి హిజ్రాలతో గొడవ జరిగింది. చిన్న ఘర్షణ కాస్త సినిమా ఫైట్‌ను తలపించే జరిగింది. మధ్యాహ్నం ప్రజలందరూ చూస్తుండగానే బాహాబాహీకి దిగారు. తిరుమలగిరి హిజ్రా గ్రూపులకు చెందిన వారు ఇటీవల అర్వపల్లి ప్రాంతంలో సూర్యాపేట వారు వచ్చి డబ్బులు వసూలు చేశారని ఇప్పుడు తుంగతుర్తి ప్రాంతానికి తిరుమలగిరి వచ్చి డబ్బులు వసూలు చేస్తుండడంతో ఒకరి ప్రాంతాల్లోకి ఒకరు రావడంతో ఘర్షణ చోటుచేసుకుంది. ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా హిజ్రాలు కొట్టుకోవడంతో సుమోటోగా కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ ఏడుకొండలు తెలిపారు.

173 లీటర్ల మద్యం పట్టివేత

వేములపల్లి, మార్చి 18: అక్రమంగా నిల్వ ఉంచిన 173 లీటర్ల మద్యాన్ని పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ డి.విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా వేములపల్లి మండలంలోని రావులపెంట గ్రామానికి చెందిన ఉత్తెర్ల మధు అనుమతులు లేకుండా తన ఇంట్లో మద్యం నిల్వ ఉంచారు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి 173లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. మద్యం విలువ సుమారు రూ.1.62లక్షలు ఉంటుందని ఎస్ఐ తెలిపారు. పట్టుకున్న మద్యాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించి, మధుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మూడు నెలలుగా అందని వేతనాలు

అవస్థలు పడుతున్న 'ఉపాధి' సిబ్బంది

సకాలంలో వేతనాలు అందక మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న సిబ్బంది తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్ఠాత్మకంగా అమలుచేస్తున్న 'ఉపాధి' పథకంలో మూడు నెలలుగా వేతనాలు అందక సిబ్బంది అవస్థలు పడుతున్నారు. మఠంపల్లి మండలంలో 'ఉపాధి' పథకంలో ఒక ఏపీవో, ఒక ఈసీ, నలుగురు టీఏలు, ఇద్దరు కంప్యూటర్ ఆపరేటర్లతో పాటు మండలంలోని 29 పంచాయతీ, ఆవాస గ్రామాలకు 15మంది ఫీల్డ్ అసిసెంట్లు విధులు నిర్వహిస్తున్నారు. నిత్యం క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న ఈ సిబ్బందికి సకాలంలో జీతాలు అందడంలేదు. దీంతో అప్పుచేసి కుటుంబాలను పోషించుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. రాష్ట్రంలో నూతనంగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా జీతాలు సక్రమంగా వస్తాయని ఎదురుచూసిన సిబ్బందికి నిరాశే ఎదురవుతోంది. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో 'ఉపాధి' ఈసీలు, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొనడంతో పాటు గ్రామాల్లో 'ఉపాధి' పనులను గుర్తిస్తూ, కూలీలకు పని కల్పిస్తున్నారు. కూలీలకు జాబ్ కార్డులు వచ్చేందుకు కృషి చేయడం, కూలీలందరికీ పని రోజులు కల్పించేందుకు నిరంతరం శ్రమిస్తున్నారు. ఈ సిబ్బందికి డిసెంబరు, జనవరి, ఫిబ్రవరి నెలల జీతాలు అందలేదు. 'ఉపాధి' కూలీలు చేస్తున్న పనులను పర్యవేక్షించడానికి ఈ ఉద్యోగులు నిత్యం క్షేత్రస్థాయికి వెళ్లాలి. గ్రామాలో కూలీలు చేసిన పనుల నివేదికలు, మస్టర్లు, తదితర రిపోర్టులు రూపొందించడానికి మండల కేంద్రానికి వెళ్లాల్సి ఉంటుంది. వచ్చే కొద్దిపాటి వచ్చే జీతాలు కూడా అందనందున ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. సకాలంలో జీతాలు చెల్లించి తమను ఆదుకోవాలని ఉద్యోగులు కోరుతున్నారు.

మూడు నెలలుగా జీతాలు అందనందున తీవ్రంగా ఇబ్బంది పడుతున్నానని మచ్యాతండాకు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ రవినాయక్ తెలిపారు.

● కేంద్రం నుంచి బడ్జెట్‌లో కేటాయించిన నిధులు సకాలంలో విడుదల కానందున 'ఉపాధి' సిబ్బందికి మూడు నెలలు వేతనాలు ఇవ్వలేకపోయామని, ప్రభుత్వం నుంచి నిధులు మంజూరుకాగానే జీతాలు ఇస్తామని ఎంపీడీవో మామిడి జానకిరాములు తెలిపారు.

● మఠంపల్లి

పద్మవ్యూహంలా సూర్యాపేట పట్టణం



జిల్లా కేంద్రంలోని కొత్త బస్‌స్టేషన్ వద్ద అండర్‌పాస్ ప్రాంతంలో అయిన ట్రాఫిక్ జాం

జిల్లా కేంద్రంగా సూర్యాపేట ఏర్పడినప్పటినుంచి పట్టణంలో ట్రాఫిక్ విపరీతంగా పెరిగింది. జిల్లా కేంద్రంలోని కొత్త బస్‌స్టేషన్ సమీపంలోని అండర్ పాస్‌లో మధ్యలో డివైడర్ ఉండగా, ఈ మార్గం నుంచి కేవలం ద్విచక్రవాహనాలు మాత్రమే వెళ్లేవి. ఇటీవల అండర్‌పాస్‌లోని డివైడర్‌ను తొలగించడంతో ఈ మార్గం నుంచి కార్లు, ట్రాక్టర్లు, బైకులు, ఆటోలు వెళుతున్నాయి. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి, వివిధ షాపింగ్ మాల్స్‌కు వెళ్లడానికి, నూతన కలెక్టరేట్‌కు, కళాశాలలకు ఈ అండర్‌పాస్ నుంచే ఎక్కువమంది వెళుతుంటారు. దీంతో ట్రాఫిక్ పద్మవ్యూహంగా మారింది. ట్రాఫిక్‌లో చిక్కిన వాహనదారులు ముందుకు వెళ్లలేక, వెనక్కి రాలేక ఇబ్బంది పడుతున్నారు. పట్టణంలోని పలు వాణిజ్య, వ్యాపార దుకాణాలకు, ఆసుపత్రులకు సరైన పార్కింగ్ సౌకర్యం లేనందున వాహనాలను రోడ్డుపైనే పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య జటిలమైంది. జిల్లా కేంద్రంలోని వాణిజ్య భవన్ సెంటరు, కొత్త బస్ స్టేషన్, అండర్ పాస్, రాఘువప్లాజా సెంటరు పీఎస్ఆర్ సెంటరు, తెలంగాణ తల్లి విగ్రహ ప్రాంతం, నిర్మల ఆసుపత్రి రోడ్డు, మహాత్మాగాంధీ రోడ్డు ప్రాంతాల్లో నిత్యం ట్రాఫిక్ సమస్య ఉంటోంది. అంతేకాకుండ కుడకుడ ప్రాంతం రోడ్డు ఇరుకుగా ఉండడంతో వాహనదారులు ఇబ్బందిపడుతున్నారు.

స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నాం

పట్టణంలో ట్రాఫిక్ ఎక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించాం. స్పెషల్‌డ్రైవ్‌తో వాహనదారులకు ట్రాఫిక్ సమస్యపై అవగాహన కల్పిస్తున్నాం. భవన యజమానులు సెట్ బ్యాక్ పాటించచి నిర్మాణాలు చేయాలని సూచిస్తున్నాం.

● సాయిరాం, ట్రాఫిక్ ఎస్ఐ, సూర్యాపేట

● సూర్యాపేట టౌన్

యమగండాలుగా ఆటోలు



మఠంపల్లి మండలంలో ఆటోపై ప్రమాదకరంగా ప్రయాణిస్తున్న ప్రజలు (ఫైల్ ఫొటో)

మఠంపల్లి మండలంలో ఆటోలు యమగండాలుగా మారాయి. ఆటోలో ప్రయాణిస్తూ పలువురు మృత్యువాత పడ్డారు. నిబంధలకు విరుద్ధంగా డ్రైవర్ ఆటోలను తిప్పుతున్నా నిఘా లేనందునే ప్రమాదాలు జరుగుతున్నాయన్న విమర్శలు వినబడుతున్నాయి. పలువురు ఆటోలను కొనుగోలు చేసి అద్దెకు ఇస్తు న్నారు. డ్రైవింగ్ సరిగా రాకున్నా కొంత మంది ఆటోలను అద్దెకు తీసుకుని నడుపుతున్నారు. డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఆటోల్లో ఎక్కించుకుని అధికవేగంతో రాకపోకలు సాగిసున్నన్నారు. డ్రైవర్ సీటుకు ఇరువైపులా ఏర్పాటు చేసుకున్న అదనపు సీట్లను పోలీసులు గతంలో తొలగించారు. ప్రస్తుతం నిఘా లోపించినందున యథాప్రకారం సీట్లు ఉన్నాయి. పలు ఆటోలకు ఫిట్‌నెస్ కూడా ఉండటంలేదు. ఆటోల్లో ప్రయాణిస్తూ మండలంలో ఐదేళ్ల కాలంలో ఆరుగురు మృత్యు వాతపడగా, 20 మందికి పైగా గాయపడ్డారు. ప్రమాదాలు జరిగిన సమయంలో హడావిడి చేసే అధికారులు ఆ తర్వాత పట్టించుకోవడంలేదని స్థానికులు తెలిపారు. పోలీసులు, రవాణా శాఖ అధికారులు నిఘా ఏర్పాటు చేసి నిబంధలకు అనుగుణంగా లేని ఆటోలను కట్టడి చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై ఎస్ఐ ఎం.రామాంజనేయులును వివరణ కోరగా పరిమితికి మించి ప్రయాణికులతో వెళ్లే ఆటోలపై నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. ఆటోలు నడిపే డ్రైవర్లతో సమావేశం నిర్వహించి అవసరమైనవారికి శిక్షణ ఇస్తామన్నారు.

● మఠంపల్లి

జగన్మోహిని అవతారంలో దర్శనమిచ్చిన శ్రీరాముడు



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

కోదాడ టౌన్, మార్చి 18: పట్టణంలో శ్రీకోదండ రామస్వామి ఆలయ పునర్నిర్మాణం సందర్భంగా విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు మూడో రోజు సోమవారం వైభవంగా కొనసాగాయి. ఈ సందర్భంగా శ్రీరామచంద్ర స్వామి జగన్మోహిని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మోహిని ఉత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. 18 హోమగుండాల వద్ద దంపతులతో వేదపండితులు యాగం చేయించారు. తెల్లవారుజాము నుంచే విశేష పూజలు, హోమాలు నిర్వహించారు. రుద్రాభిషేకం, రుద్రహోమం, విష్వక్సేన పూజ, సుప్రభాతం, ప్రబంధ పారాయణం, వేద పారాయణం, క్షీరాధివాసం నిర్వహించారు. దంపతులు పూజల్లో పాల్గొన్ని అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ విమాన శిఖరాలకు జలాభిషేకం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పూజా కార్యక్రమాల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, ప్రతిష్ఠ నిర్వాహణ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

శాంతి, కరుణకు ప్రతి రూపం ఏసుక్రీస్తు

సూర్యాపేట టౌన్, మార్చి 18: శాంతి, కరుణకు ప్రతి రూపం ఏసుక్రీస్తు అని పాస్టర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, బిషప్ దుర్గం ప్రభాకర్, పాస్టర్ జాన్ మార్క్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని శాంతినగర్‌లో ఏర్పాటు చేసిన సూర్యాపేట నియోజకవర్గ పాస్టర్ల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడారు. ఏసుక్రీస్తు బోధనలను ప్రజలకు చేరవేయడంలో ఎలాంటి స్వార్థం లేకుండా పాస్టర్లు పని చేయాలన్నారు. అనంతరం పలువురు పాస్టర్లను సన్మానించారు. కార్యక్రమంలో పాస్టర్లు జలగం జేమ్స్, ఇంజమూరి గాబ్రియేల్, డేవిడ్‌నాయక్, ఇరుగు శ్యాంసన్, డేవిడ్, శంతయ్య, ప్రశాంత్, లాకునాయక్, బాలాజీనాయక్ పాల్గొన్నారు

జాన్‌పహాడ్ దర్గా అభివృద్ధికి సహకరించాలి

సూర్యాపేట టౌన్, మార్చి 18: జిల్లాలోని జాన్‌పహాడ్ దర్గా అభివృద్ధికి సహకరించాలని జాన్‌పహాడ్ దర్గా ముతావలిలు మహ్మద్ ముబీన్, మహ్మద్ సలార్ కోరారు. సోమవారం హైదరాబాద్‌లో నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి మాట్లాడారు. 30సంవత్సరాల నుంచి న్యాయపోరాటం చేయగా జాన్‌పహాడ్ దర్గా ముతావలిలుగా తమను గుర్తిస్తూ హైకోర్టు ఇటీవల తీర్పు ఇచ్చిందని, న్యాయం జరిగిందని మంత్రికి తెలిపారు.. కార్యక్రమంలో నాయకులు ఎండీ ఖలీద్‌అహ్మద్, జమాల్ హుస్సేన్, గౌస్, గౌస్‌బాబా పాల్గొన్నారు.

జానకినగర్‌లో నీటి ఎద్దడి

చిలుకూరు, మార్చి 18: మండలంలోని జానకినగర్ గ్రామంలో మంచినీటి ఎద్దడి నెలకొంది. దీంతో పంచాయతీ ఆధ్వర్యంలో ట్యాంకర్ ద్వారా నీటిని సోమవారం సరఫరా చేశారు. మంచినీటిని పట్టుకోవడానికి గ్రామస్థులు బారులుతీరారు. వేసవి కాలం ప్రారంభంలోనే గ్రామంలో మంచినీటి ఎద్దడి ఏర్పడిందని, గ్రామంలో మంచి నీటి సమస్యను ప్రభుత్వం పరిష్కరించాలని ఆ గ్రామస్థులు కోరారు.

'ప్రజాఉద్యమాలను బలోపేతం చేయాలి'

సూర్యాపేట టౌన్, మార్చి 18: ప్రజాఉద్యమాలను బలోపేతం చేయాలని సీపీఐ (ఎంఎల్)మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని విక్రమ్‌భవన్‌లో ఆత్మకూర్(ఎస్) మండలం తుమ్మలపెన్‌పహాడ్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకుడు పిడమర్తి లింగయ్యతో పాటు వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్‌లో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించి ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కారింగుల వెంకన్న, కొత్తపల్లి రేణుక, ఎర్ర అఖిల్‌కుమార్, ఎస్‌కే సయ్యద్, పద్మ పాల్గొన్నారు.

జిల్లా సరిహద్దులో ముమ్మరంగా తనిఖీలు

కోదాడ రూరల్, మార్చి 18: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన మండలంలోని నల్లబండగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని రామాపురం క్రాస్‌రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు సోమవారం ముమ్మరంగా తనిఖీలు చేశారు.ఈ తనిఖీల్లో ఏఎస్ఐ కృష్ణయ్య పాల్గొన్నారు.

ఫ్లెక్సీల తొలగింపు, కేంద్ర బలగాల కవాతు

మఠంపల్లి, మార్చి 18: మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తహసీల్దార్ మంగారాథోడ్, ఎంపీడీవో మామిడి జానకిరాములు ఆధ్వర్యంలో తొలగించారు. మండల కేంద్రంలో కేంద్ర బలగాలు కవాతు నిర్వహించాయి. ఈ సందర్భంగా కోదాడ సీఐ రజితారెడ్డి, ఎస్ఐ సురభి రాంబాబు మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించడానికి ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఏఎస్ఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా 'పది' పరీక్షలు ప్రారంభం



నేరేడుచర్లలో విద్యార్థినిని తనిఖీ చేస్తున్న ఇన్విజిలేటర్



తిరుమలగిరిలో విద్యార్థిని తనిఖీ చేస్తున్న ఇన్విజిలేటర్



కోదాడలో పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు

జిల్లాలో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతగా ప్రారంభమయ్యాయి. జిల్లాలో 11946 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 11904 మంది పరీక్ష రాశానని డీఈవో అశోక్ తెలిపారు. తిరుమలగిరి మండలం గుండెపురి గ్రామా నికి చెందిన పదో తరగతి విద్యార్థిని మౌనిక తండ్రి పాలకుర్తి వెంకన్నగౌడ్ ఆదివారం తాటిచెట్టుపై నుంచి పడి మృతి చెందాడు. ఆ బాధను కుమార్తె దిగమింగుకుని పరీక్షకు హాజరైంది. సూర్యాపేటలోని రెండు పరీక్షా కేంద్రాలను కలెక్టర్ తనిఖీ చేశారు.

● ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్



ఆత్మకూర్(ఎస్)లో హాల్‌టికెట్ల నెంబర్లను చూస్తున్న విద్యార్థినులు



ఆత్మకూర్(ఎస్)లో పరీక్షా కేంద్రంలో విద్యార్థులు



మేళ్లచెర్వులోని పరీక్షా కేంద్రంలో విద్యార్థీనీవిద్యార్థులు



గరిడేపల్లిలో విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

సాగు నీటిని విడుదల చేసి రైతులను కాపాడాలి

తుంగతుర్తి, మార్చి 18: ప్రభుత్వం సాగునీటిని విడుదల చేసి రైతులను కాపాడాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య కోరారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో పచ్చని పైర్లలో ఉన్న పొలాలు, నేడు నీరు లేక ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు ఎండిన పైర్లకు ఎకరాకు రూ.25వేల నష్టపరిహారం ఇచ్చి రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా నాయకుడు గుండగాని రాములుగౌడ్, వైస్ ఎంపీపీ శ్రీశైలం, శ్రీకాంత్‌రెడ్డి, గోపగాని రమేష్ పాల్గొన్నారు.

మోతెను కరువు మండలంగా ప్రకటించాలి

మోతె, మార్చి 18: మోతెను కరువు మండలంగా ప్రభుత్వం ప్రకటించి రైతులను ఆదుకోవాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసి సబ్ డివిజన్ కార్యదర్శి కునుకుంట్ల సైదులు కోరారు. మోతె మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని కోరుతూ సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట న్యూడెమోక్రసీ, ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి మాట్లాడారు. మండలంలోని చివరి ఆయకట్టు వరకు ఎస్సారెస్పీ నీటిని అందించేవిధంగా నాయకులు, అధికారులు చూడాలన్నారు. అనంతరం తహసీల్దార్ సంఘమిత్రకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కొమ్ము వెంకన్న, ఎర్ర బోయిన లింగన్న, పొడపంగి ముత్తన్న, అబ్బాస్ పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌కు సన్మానం

నూతన్‌కల్, మార్చి 18: ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా నియామకమైన నాగరిగారి ప్రీతంను కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు కొమ్ము శ్రీనివాస్ సోమవారం కలిసి సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రీతం మాట్లాడుతూ ఎస్సీల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. సన్మానించిన వారిలో వెంకన్న, రవి, మల్లేష్ ఉన్నారు.

అటవీ భూములను కాపాడాలి: సీపీఐ

పాలకవీడు, మార్చి18: మండలంలో అన్యాక్రాంతమైన అటవీ భూములను కాపాడాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధూళిపాళ ధనుంజయనాయుడు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం గుండ్లపహాడ్ గ్రామంలో నిర్వహించిన సీపీఐ ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వంలోని కొంతమంది అండతో అటవీ భూములను కొందరు ఆక్రమించి పదేళ్లుగా సాగుచేసుకుంటున్నారని, ఆరోపించారు. ఆ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని మొక్కలు పెంచాలని సూచిం చారు. సమావేశంలో సీపీఐ నాయకులు ముళ జానయ్య, పున్నయ్య, వెంకటయ్య, రామన్న, వెంకన్న పాల్గొన్నారు.

పంచాయతీ రికార్డులను పరిశీలించిన డీఎల్పీవో

మేళ్లచెర్వు, మార్చి 18: మండల కేంద్రంలోని మేజర్ గ్రామపంచాయతీలో పన్ను చెల్లింపుల్లో అక్రమాలు చోటుచేసుకున్నాయన్న ఆరోపణలపై డీఎల్పీవో యాదగిరి సోమవారం విచారణ చేపట్టారు. పంచాయతీ పరిధిలోని, ప్రైవేట్ కంపెనీలు నిబంధనలకు ప్రకారం పన్ను చెల్లించకుండా గ్రామపంచాయతీ ఆదాయానికి గండికొట్టాయని, ఎన్నికల ముందు నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు పొందారని ఫిర్యాదులు అందాయి. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు జీపీ కార్యాలయంలో రికార్డులను డీఎల్పీవో పరిశీలించారు. ఫిర్యాదు దారుడు కమతం నాగార్జునను వివరాలు సేకరించారు. అనంతరం మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలను తొలగింపజేశారు.

జబ్బార్‌కు సన్మానం

కోదాడ టౌన్, మార్చి 18: రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ వైస్ చైర్మన్‌గా నియామకమైన కోదాడకు చెందిన కాంగ్రెస్ నాయకుడు షేక్ జబ్బార్‌ను కోదాడ మాజీ సర్పంచ్, డీసీసీ ఉపాధ్యక్షుడు పారా సీతయ్య సన్మానించారు. ఈ సందర్భంగా సీతయ్య మాట్లాడుతూ మైనార్టీల సంక్షేమానికి కృషిచేయాలని జబ్బార్‌కు సూచించారు. కాంగ్రెస్ పార్టీకి సేవలందించినవారికి ప్రభుత్వం న్యాయం చేస్తుందన్నారు. కార్యక్రమంలో బాల్‌రెడ్డి, పాలూరి సత్యనారాయణ, సైదా నాయక్, వెంకట్రావు, యాకూబ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్‌పై అసత్య ప్రచారాన్ని మానుకోవాలి'

అనంతగిరి, మార్చి 18: కాంగ్రెస్‌పై మండలంలోని శాంతినగర్ గ్రామ మాజీ సర్పంచ్ బద్దం కృష్ణారెడ్డి చేస్తున్న అసత్య ప్రచారాన్ని మానుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు శ్రీనివాసరెడ్డి, కోదాడ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గునుకుల గోపాల్‌రెడ్డి కోరారు. సోమవారం శాంతినగర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కృష్ణారెడ్డి ఇంటిని (ఆర్‌వోడబ్ల్యూ) నిబంధనల ప్రకారం కూల్చుతుంటే, కాంగ్రెస్ పార్టీ కావాలనే కూల్చేయిస్తుందని ఆరోపణలు చేయడం సరికాదన్నారు. సమావేశంలో ఎంపీపీ వెంకటేశ్వర్లు, వెంకటరెడ్డి, బాబునాయక్, కొండయ్య, పాల్గొన్నారు.

జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి

గరిడేపల్లి, మార్చి 18: జ్వరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి నరేష్ అన్నారు. మండల కేంద్రంలో పలువురు జ్వరాల బారిన పడటంతో వైద్యాధికారి నరేష్ ఆధ్వర్యంలో సోమవారం 43 మంది వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ఇంటింటి సర్వే నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడుగురి నుంచి రక్త నమూనాలను సేకరించి పరీక్షలకు పంపామన్నారు.

26న హుజూర్‌నగర్ బార్ అసోసియేషన్‌కు ఎన్నికలు

హుజూర్‌నగర్, మార్చి 18: హుజూర్‌నగర్ బార్ అసోసియేషన్ ఎన్నికలను ఈ నెల 26న నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారులు సుందర రాఘవరావు, వట్టికూటి అంజయ్య తెలిపారు. సోమవారం పట్టణంలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో వారు మాట్లాడుతూ ఈ నెల 18, 19తేదీల్లో నామినేషన్లు స్వీకరిస్తామని, 20న నామినేషన్ల పరిశీలన, 21న నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందన్నారు. ఈనెల 26న ఉదయం నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్, తదనంతరం కౌంటింగ్ నిర్వహించి, ఫలితాలు వెల్లడిస్తామన్నారు.

వరి విత్తనాల్లో లోపాలు ఉన్నాయి: ఏవో

ఆత్మకూర్(ఎస్), మార్చి 18: మండలంలోని కందగట్ల గ్రామంలో ఏర్పుల సైదులు సాగు చేసిన వరి పైరు విత్తనాల్లో లోపాలు ఉన్నాయని మండల వ్యవసాయాధికారి దివ్య తెలిపారు. దుకాణదా రుడు నకిలీ వరి విత్తనాలు విక్రయించడని రైతు సైదులు ఫిర్యాదు చేయడంతో ఆయన సాగు చేసిన వరి పైరును సోమవారం కందగట్ల గ్రామంలో ఏవో పరిశీలించి మాట్లాడారు. కొన్ని కంకులు ముందుగా ఏర్పడగా, మరి కొన్ని ఆలస్యంగా ఏర్పడుతున్నట్లు గుర్తించామన్నారు. వరి వంగడాల్లో ఇతర విత్తనాలు కలిస్తే ఈ విధంగా వచ్చే అవకాశం ఉందని, ఈ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతానన్నారు. ఏవో వెంట ఏఈవో శివకుమార్, రైతు సైదులు ఉన్నారు.

'ఆక్రమణకు గురైన చెరువులను కాపాడాలి'

హుజూర్‌నగర్, మార్చి 18: జిల్లాలో ఆక్రమణలకు గురైన చెరువులు, కుంటలను కాపాడాలని మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి శీలం శ్రీను, జిల్లా కార్యదర్శి చింతకాయల రాము కోరారు. సోమవారం హైదరాబాద్‌లో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసి చెరువుల ఆక్రమణలు, పూడికతీత, పూర్తి స్థాయిలో పట్టణంలోని ట్యాంక్ బండ్ నిర్మాణం పూర్తిచేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మల్లయ్య, సీతారాములు, వెంకన్న, గోపమ్మ, యశోద పాల్గొన్నారు.

'ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి'

హుజూర్‌నగర్, మార్చి 18: రాష్ట్రంలో సివిల్ సప్లయ్ గోదాంలలో పని చేస్తున్న కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్‌యాదవ్ కోరారు. సోమవారం పట్టణంలోని గోదాంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. కరోనా వంటి కష్టకాలంలో కార్మికులు ప్రాణాలను పణంగాపెట్టి పనిచేశారని, నిత్యావసర సరుకులు అందించడంలో కీలకపాత్ర పోషించారని కొనియాడారు. సమావేశంలో సైదులు, వెంకన్న, రామ్మూర్తి, వెంకటాద్రి, మల్లయ్య, కోటేశ్వరరావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



సూర్యాపేట టౌన్: వాహనాలు వేగంగా నడుపుతూ ఇతరులకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని షీటీం ఎస్ఐ ప్రవీణ్ హెచ్చరించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని షీటీం కార్యాలయంలో వేగంగా వాహనాలు నడుపుతున్న యువతకు నిర్వహించిన కౌన్సెలింగ్‌లో ఆయన మాట్లాడారు.

హుజూర్‌నగర్: ఎక్సైజ్ పరిధిలో సీజ్ చేసిన 10వాహనాలకు పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో ఈనెల 20న వేలంపాట నిర్వహించనున్నట్లు సీఐ నాగార్జునరెడ్డి తెలిపారు. పట్టణంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా ఎక్సైజ్ అధికారి లక్ష్మణ్‌నాయక్ ఆధ్వర్యంలో ఉదయం తొమ్మిది గంటల నుంచి వేలంపాట నిర్వహిస్తామన్నారు. వేలంలో పాల్గొనే వారు ముందుగా దరావత్ రుసుం చెల్లించాలన్నారు.

● హుజూర్‌నగర్ పట్టణంలోని రిటైర్డు ఉద్యోగుల కార్యాలయంలో మంగళవారం ఉచిత కంటివైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం పట్టణ అధ్యక్షుడు చెన్నా సోమయ్య, కార్యదర్శి వీరారెడ్డి, ఎంఎస్ఎన్‌రాజు తెలిపారు. సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు.

● హుజూర్‌నగర్‌లో బీఆర్ఎస్ నియోజకవర్గ సమావేశాన్ని ఈనెల 20వ తేదీన నిర్వహిస్తున్నట్లు జడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి, పార్టీ పట్టణ కార్యదర్శి అమర్‌గౌడ్ తెలిపారు. పట్టణంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సమావేశానికి మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య హాజరవుతున్నట్లు తెలిపారు.

● హుజూర్‌నగర్ బైపాస్ రోడ్డులో 11కేవీ ఏబీ స్విచ్ ఏర్పాటుచేస్తున్నందున మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్న ఏఈ రాంప్రసాద్‌గౌడ్ తెలిపారు.

హుజూర్‌నగర్ రూరల్: రక్తదానం చేసి ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలని బీఎస్ఆర్ ట్రస్ట్ అధ్యక్షుడు దగ్గుపాటి బాబూరావు కోరారు. ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యల్లమ్మకు యువకుడు నరేష్‌తో రక్తదానం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

● ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధులుగా పాత్రికేయులు ఎనిచేయాలని హుజూర్‌నగర్ ఆర్డీవో శ్రీనివాసులు కోరారు. సోమవారం పట్టణంలో తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం, ఐజేయూ ఆధ్వర్యంలో ఆర్డీవోను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు ఎన్.నరేందర్, రామిరెడ్డి, పిల్లలమర్రి శ్రీనివాస్, శ్రీనివాసాచారి, రాజు యాదవ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేరేడుచర్ల: రజక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని జిల్లా రజక సంఘం నాయకుడు శ్రీను ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు

మఠంపల్లి: మండలంలోని మట్టపల్లి క్షేత్రంలో శ్రీలక్ష్మీనృసింహుని నిత్య కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో నవీన్, అర్చకులు పాల్గొన్నారు.

● గ్రామ పంచాయతీ కార్మికులకు ప్రభుత్వం సకాలంలో జీతాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు సయ్యద్ రన్‌మియా కోరారు.ఆరు నెలలుగా వేతనాలు రాక జీపీ కార్మికులు ఇబ్బంది పడుతున్నారని, వెంటనే చెల్లించాని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఎంపీడీవో జానకిరాములుకు సోమవారం వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఇంటిరవి, మైసయ్య, గుర్వారెడ్డి, దేవదానం, సంతోషి, సైదులు, సైదా నాయక్, ఏసు, రహీం, పాండునాయక్ పాల్గొన్నారు.

కోదాడ: పట్టణంలోని 22వ వార్డులో ఫ్రెండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన షటిల్ పోటీలను పట్టణ సీఐ రాము, వైద్యులు జాస్తి సుబ్బారావు ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యాయామంపై దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో కోట మధు, తోట రంగారావు, చందా శ్రీనివాసరావు, హనుమంతరాజు, రవికుమార్, వెంకటేశ్వర్లు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కోదాడ రూరల్, గరిడేపల్లి: పాడి పశువులకు గాలికుంటు నివారణా టీకాలు వేయించాలని పశువైద్యాధికారి నాగేంద్రబాబు అన్నారు. మండలంలోని పంతులునాయక్‌తండా, గుడిబండ, కాపుగల్లు, యర్రారం, గణపవరం గ్రామాల్లో 238పాడి పశువులకు ఉచిత గాలికుంటు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో డాక్టర్ సురేంద్ర, పశువైద్య సిబ్బంది అరుణ, ఖాన్, సాయికృష్ణ, శ్రీను, శరత్ తదితరులు పాల్గొన్నారు.

● పశువులకు సకాలంలో టీకాలు వేయించి కాపాడుకోవాలని గరిడేపల్లి మండల పశువైద్యాధికారి సీహెచ్ నాగేంద్ర అన్నారు. మండలంలో సోమవారం నాలుగు ఆవులు, 124 గేదెలకు టీకాలు వేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది నజీర్, రజిత, శేఖర్, అజహర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నూతన్‌కల్: హోలీ పండగలో ఆధ్యాత్మికత దాగి ఉందని త్రైత సిద్ధాంతం-ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక గుండెపూడి కమిటీ అధ్యక్షుడు కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని లింగంపల్లి గ్రామంలో భగవద్గీత, అనుబంధ గ్రంథాల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సుజాత, బారతి, ఇందు, మమత, శివ, ఈశ్వర్, శివ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మద్దిరాల: భువనగిరి ఎంపీ స్థానం టిక్కెట్‌ను కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్‌కు కేటాయించాలని ఆ పార్టీ జిల్లా నాయకుడు బిక్షపతిగౌడ్ కోరారు. సోమవారం మండల కేంద్రంలో ముఖ్యకార్యకర్తతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో నాయకులు బింగి బిక్షపతిగౌడ్, వల్లపు రమేష్, ఏల్లేష్, నర్సయ్య, లచ్చయ్య, వెంకటయ్య, సోమయ్య పాల్గొన్నారు.